

పక్కాగా ఎంసీసీ

ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ)ని అధికారులు పక్కాగా అమలు చేస్తున్నారు. 8లో



టమాట కిలో రూ.12

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

సోమవారం	మంగళవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.32	సెహరీ : 5.08



న్యూస్‌రీల్

రూ.50 వేలకు పైగా నగదుకు ఆధారాలుండాల్సిందే!



అనంతపురం: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఎవరైనా రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లాలంటే తగిన ఆధారాలు చూపాల్సి ఉంటుందని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ స్పష్టం చేశారు. రూ.10 వేల కన్నా విలువైన వస్తువుల రవాణాకు కూడా నిబంధన వర్తిస్తుందన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రశాంత, పారదర్శక ఎన్నికలే లక్ష్యమన్నారు. అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. సభలు, సమావేశాల నిర్వహణకు అనుమతి తీసుకోవాలన్నారు. కుల, మత, ప్రాంతీయపరంగా విద్వేషాలు రెచ్చగొట్టరాదని రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. దేవాలయాలు, మసీదులు, చర్చిలు, విద్యాసంస్థల్లో ఎన్నికల ప్రచారం చేయరాదన్నారు. అనుమతి లేకుండా బ్యానర్లు కట్టడం, లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయడం, గోడలపై నినాదాలు రాయడం, పోస్టర్లు అతికించడం వంటివి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారానికి వినియోగించే ప్రతి వాహనానికి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పార్టీల స్టార్ క్యాంపెనయిర్లు రూ.లక్షకు మించి నగదు కలిగి ఉండరాదన్నారు. పరిమితికి మించి డబ్బు తీసుకెళ్తే వాహనాలతో పాటు నగదు కూడా సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

జెడ్పీ డిప్యూటీ సీఈఓగా రమణారెడ్డి

- గుంతకల్లు డీఎల్‌డీఓగా లలితబాయి బదిలీ



జిల్లా పరిషత్ కార్యాలయం

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా వైపీ రమణారెడ్డి నియమితులయ్యారు. డ్వామా విజిలెన్స్ విభాగంలో పని చేస్తున్న ఆయనను డిప్యూటీ సీఈఓగా బదిలీ చేస్తూ అనంతపురం జిల్లా కలెక్టర్ గౌతమి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకూ డిప్యూటీ సీఈఓగా పనిచేసిన లలితబాయిని గుంతకల్లు డీఎల్‌డీఓగా బదిలీ చేశారు. రమణారెడ్డి గతంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓగా పనిచేశారు. 2019 ఆగస్టు నుంచి 2020 జూన్ వరకు బాధ్యతలు నిర్వర్తించారు. కాగా, జెడ్పీలో కొంతకాలంగా అధికారులు, పాలకవర్గం నడుమ సఖ్యత లేదు. లలిత బాయి తీరుపై సభ్యులు గుర్రుగా ఉన్నారు. ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంతో పాటు స్థాయీ సంఘాల సమావేశాల్లో లలితబాయితో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎహసాన్ బాషా, ఈఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఈఓను ప్రభుత్వానికి సరెండర్ చేసే వరకూ సమావేశాలకు హాజరుకామని తేల్చిచెప్పారు. ఈ క్రమంలోనే లలితబాయిని బదిలీ చేసి రమణారెడ్డిని నియమించడం గమనార్హం. సోమవారం (నేడు) ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కో-ఆర్డినేటింగ్ అధికారి, కమిషనర్ మేఘ స్వరూప్



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు



అభ్యర్థులను పరిశీలించి కేంద్రంలోకి పంపుతున్న పోలీసులు

సజావుగా గ్రూప్-1 ప్రిలిమ్స్

అనంతపురం/అర్బన్: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా గ్రూప్-1 ప్రిలిమ్స్ సజావుగా జరిగింది. 33 కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా జరిగిన పరీక్షకు 64.68 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 11,597 మంది దరఖాస్తు చేసుకోగా, మొదటి సెషన్‌కు 7,542 మంది (65.03 శాతం) హాజరయ్యారు. 4,055 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన పరీక్షకు 7,459 మంది (64.32 శాతం) హాజరయ్యారు. 4,138 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల కో-ఆర్డినేటింగ్ అధికారి, కమిషనర్ మేఘ స్వరూప్ పలు కేంద్రాలను సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. పరీక్షల నిర్వహణను ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ కె.శ్రీనివాసరావు, సెక్షన్ ఆఫీసర్లు యోగేశ్వరరావు, వెంకటరమణ పర్యవేక్షించారు. ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏఎస్పీ రామకృష్ణ, డీఎస్పీలు వీర రాఘవ రెడ్డి, బీవీ శివా రెడ్డి పర్యవేక్షించారు. అభ్యర్థులను తనిఖీ చేసిన తరువాత కేంద్రంలోకి అనుమతించారు.

విద్యార్థీ విజయోస్తు

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

- సర్వం సిద్ధం చేసిన విద్యాశాఖ అధికారులు
- రాష్ట్రంలోనే ఎక్కువమంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్న జిల్లా 'అనంత'
- పేపర్ లీక్ చేస్తే అడ్డంగా బుక్ అవుతారని అధికారుల హెచ్చరిక



అనంతపురంలోని శారద మున్సిపల్ హైస్కూల్‌లో పరీక్షకు సిద్ధం చేసిన బల్లలు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థి జీవితంలో తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాసే రోజు రానే వచ్చింది. జిల్లాలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 30న ముగుస్తాయి. తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల్లో సహజంగా భయం, ఆందోళన ఉంటుంది. వీటిని అధిగమించడానికి ఆయా స్కూళ్లలో హెచ్‌ఎంలు, టీచర్లు విద్యార్థులకు అవగాహన కల్పించి సిద్ధం చేశారు. జిల్లాలో 40,063 మంది రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. రాష్ట్రంలోనే అన్ని జిల్లాల కంటే మన జిల్లాలో ఎక్కువమంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. కేంద్రాల్లో తాగునీరు, ఫర్నిచరు, విద్యుత్ సదుపాయం కల్పించారు.

గంట ముందే చేరుకోవాలి..

తొలిరోజు విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ముందుగా వచ్చి హాల్‌టికెట్ నంబరు ఆధారంగా ఏ గది ఎక్కడుందో చూసుకోవాలని చెబుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉంటుంది. హాల్‌టికెట్ చూపిస్తే చాలు ప్రయాణానికి అవకాశం కల్పిస్తారు. పరీక్షల నిర్వహణ విధుల్లో పాల్గొనే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పోలీసుస్టేషన్ల నుంచి ప్రశ్నపత్రాలు తీసుకొచ్చే సమయం, వాటిని ఓపెన్ చూసి విద్యార్థులకు అందజేసే సమయంలో అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. మీడియంను ఒకటికి రెండుసార్లు పరిశీలించి సంబంధిత ప్రశ్నపత్రం ఇవ్వాలని అధికారులు చెబుతున్నారు. ఏమాత్రం తారుమారైనా విద్యార్థులు నష్టపోతారనే విషయాన్ని ఇన్విజిలేటర్లు గుర్తుంచుకోవాలని సూచిస్తున్నారు.

ఎంఈఓలదే పూర్తి బాధ్యత..

పరీక్ష కేంద్రాలుగా ఉన్న రెసిడెన్షియల్ స్కూళ్లలో(బీసీ,ఎస్సీ,ఎస్టీ గురుకుల పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, ప్రైవేట్ స్కూళ్లు) ఇతర తరగతుల విద్యార్థులు, సిబ్బంది పరీక్షలు జరిగే సమయంలో బయటకు వెళ్లాల్సిందే. ఆ సమయంలో కేవలం పరీక్ష రాయనున్న విద్యార్థులు, విధుల్లో పాల్గొనే సిబ్బంది మాత్రమే కేంద్రంలో ఉంటారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో కేంద్రాల్లోకి సిబ్బంది కోసం టీ, కాఫీ బయట నుంచి తీసుకురాకూడదు. పొరబాటున ఏ ఒక్క వ్యక్తి బయటకు వచ్చినా అందుకు ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారి, అడిషనల్ డిపార్ట్‌మెంటల్ అధికారి, ఎంఈఓలను బాధ్యులు చేస్తారు. విధుల్లో పాల్గొనే సిబ్బంది చాలా అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రంలోని విద్యార్థులకు ప్రశ్నపత్రాలు అందించిన అరగంట తర్వాత గైర్హాజరైన విద్యార్థులకు సంబంధించిన ప్రశ్నపత్రాలన్నీ ఇన్విజిలేటర్ల నుంచి వెనక్కు తీసుకుని ప్రత్యేకంగా ప్యాకింగ్ చేయాలి.

పరీక్ష కేంద్రాలు	- 142
పరీక్షలు రాయనున్న విద్యార్థులు	- 40,063
పరీక్ష సమయం	- ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45

అందరూ సహకరించాలి



సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలు లేని జిల్లాగా నిలవడం గర్వకారణం. పరీక్షల నిర్వహణకు సిబ్బంది, ప్రజలు ఇదే విధంగా సహకారం అందించాలి. ఎవరిస్థాయిలో వారు బాధ్యతగా పని చేయాలి. ఎక్కడా అనుమానాలకు తావివ్వొద్దు. చాలా కఠినమైన నిబంధనలు అమలులో ఉన్నాయనే సంగతిని ఎవరూ మరవద్దు.

– బి.వరలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి

అన్ని కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్



మాట్లాడుతున్న ఆర్జేడీ రాఘవరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: పదోతరగతి పరీక్షలు పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలనే ఉద్దేశంతో అన్ని కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేసినట్లు పాఠశాల విద్య ఆర్జేడీ, పదో తరగతి పరీక్షల జిల్లా పరిశీలకులు రాఘవరెడ్డి తెలిపారు. ఆదివారం డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 32 పోలీసు స్టేషన్లలో ప్రశ్నపత్రాలు భద్రపరిచామన్నారు. జిల్లాలో ఒకటి కూడా 'సీ' సెంటర్ లేదన్నారు. ఈసారి కొత్తగా ఎంఈఓలను మండల ఎగ్జామినేషన్ ఆఫీసర్లుగా నియమించామన్నారు. అలాగే 1,670 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి కేంద్రంలో ఒక అధికారిని సిట్టింగ్ స్క్వాడ్‌గా నియమించామని, సమస్యాత్మకంగా ఉన్న కేంద్రాల్లో ఇద్దరిని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఏ స్థాయి అధికారికీ సెల్‌ఫోన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఉండదని స్పష్టం చేశారు. జిల్లాలో 210 మంది విద్యార్థులకు స్క్రైబ్స్(సహాయకులు) ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల సమయంలో ఏదైనా అత్యవసరమై స్క్రైబ్స్ అవసరమైతే సంబంధిత ఎంఈఓల ద్వారా వెంటనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఈఓ వరలక్ష్మీ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందు నాయక్ పాల్గొన్నారు.

ఎన్నికల విధులు జాగ్రత్తగా నిర్వర్తించాలి

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



సీఈఓ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ నిదియాదేవి, కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్ఓ రామకృష్ణారెడ్డి

అనంతపురం అర్బన్: ''ఎన్నికల నిర్వహణలో చిన్న పొరపాటు జరిగినా ఎన్నికల కమిషన్ తీవ్రంగా పరిగణిస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి పొరపాట్లకు, తప్పిదాలకు, ఆరోపణలు, ఒత్తిళ్లు, విమర్శలకు తావివ్వకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలి. తొందరపాటుతో సొంత నిర్ణయాలు తీసుకోవద్దు. ఏదేని అంశంపై స్పష్టత లేకపోతే పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి'' అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. ఎన్నికల సన్నద్ధతపై ఆదివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగిన సూచనలు, ఆదేశాలిచ్చారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా దేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలు విషయంలో కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్), ఎస్ఎస్‌టీ (స్టాటిస్టికల్ సర్వైలెన్స్) బృందాలు క్షేత్రస్థాయిలో క్రియాశీలంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ ఆస్తులపై ఉన్న రాజకీయ పార్టీల బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లు, ఫొటోలు, జెండాలను తొలగించాలని ఆదేశించారు. బస్టాండ్, రైల్వేస్టేషన్, రోడ్లకు ఇరువైపుల, సభలు నిర్వహించే ప్రాంతాల్లో హోర్డింగ్‌లు ఉండకూడదన్నారు. రిటర్నింగ్ అధికారులు సంబంధిత ఏఆర్‌ఓలు, ఎంపీడీఓలతో మాట్లాడి వాటన్నిటినీ తక్షణం తొలగించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎస్ఎస్ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు.

ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలి..

సీ-విజిల్ యాప్‌ను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. యాప్ ద్వారా అందే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఎన్నికల కమిషన్ నుంచి అందిన ఫిర్యాదులపై అదే రోజున నివేదిక అందించాలని చెప్పారు. రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో ఎక్కడైనా వలంటీర్లు పాల్గొంటే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు జి.వెంకటేష్, రాణి సుస్మిత, కరుణ కుమారి, వసంతబాబు, కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్ రవికుమార్, నోడల్ అధికారులు వీర్రాజు, అప్పాజీ, భాస్కర్, చౌదరి, తహసీల్దారు శివరామిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దేశంలోనే అతి పెద్ద చీనీ మార్కెట్ అనంత

- ఏడాది పొడవునా క్రయవిక్రయాలు
- రైతులకు ఇబ్బందుల్లేకుండా వసతులు
- అందుబాటులోకి కవర్‌షెడ్
- మార్కెట్ యార్డు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్. జయలక్ష్మి



అనంతపురం చీనీ మార్కెట్

అనంతపురం అగ్రికల్చర్: దేశంలోనే అతి పెద్ద చీనీ మార్కెట్‌గా ఖ్యాతిగాంచిన అనంతపురంలోని మార్కెట్‌లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామని, ఈ మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని చీనీ రైతులకు మార్కెట్ యార్డు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్. జయలక్ష్మి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏడాది పొడవునా చీనీ క్రయ విక్రయాలకు అనువుగా మార్కెట్‌ను తీర్చిదిద్దినట్లు వివరించారు. అర టన్ను దిగుబడి ఉన్నా నిర్భయంగా ఇక్కడ అమ్ముకునే వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్నారు. అత్యంత పారదర్శకమైన 'ఈ-నామ్' విధానంలో క్రయవిక్రయాలు నిర్వహిస్తుండడం వల్ల ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావు ఉండదన్నారు. నాలుగైదేళ్లుగా ఏటా 70 వేల నుంచి 90 వేల టన్నుల వరకూ చీనీ క్రయ విక్రయాలు జరుగుతున్నాయని, తాజాగా రూ.2.10 కోట్లతో నిర్మించిన కవర్ షెడ్ అందుబాటులోకి తీసుకురావడంతో సీజన్ ఏదైనా చీనీ దిగుబడి దెబ్బతినకుండా ఉంటుందన్నారు. బయట తోటల్లో దళారులు, వ్యాపారులు డబుల్‌సూట్ పద్ధతిలో కొనుగోలు చేస్తుంటారని, మార్కెట్‌లో ఎలాంటి సూట్లు, కమీషన్లు లేకుండా నామమాత్రపు రుసుంతో అమ్ముకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వేళాయె

- రేపటి నుంచి కదిరి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

ఏ రోజు ఏ ఉత్సవం..

మార్చి 19న అంకురార్పణం	26న సూర్య, చంద్ర ప్రభ
20న కళ్యాణోత్సవం	27న మోహినీ ఉత్సవం
21న హంస వాహనం	28న ప్రజా గరుడ సేవ
22న సింహ వాహనం	29న గజ వాహనం
23న హనుమంత వాహనం	30న రథోత్సవం (తేరు)
24న బ్రహ్మ గరుడ సేవ	31న అశ్వ వాహనం
25న శేష వాహనం	ఏప్రిల్ 1న తీర్థవాది ఉత్సవం
	ఏప్రిల్ 2న పుష్ప యాగోత్సవం



నాలుగు గోపురాల నడుమ వెలసిన ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం



శ్రీదేవి భూదేవి సమేత నారసింహుడు

కదిరి: వసంత వల్లభుడిగా, కాటమరాయుడిగా, ప్రహ్లాద వరదుడిగా పూజలందుకుంటున్న ఖాద్రీశుడి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 19న ప్రారంభం కానున్నాయి. పక్షం రోజులపాటు జరుగుతాయి. శ్రీ మహావిష్ణువు దానవుడైన హిరణ్యకశ్యపుని శిక్షించేందుకు, తన భక్తుడైన ప్రహ్లాదుడిని రక్షించేందుకు 'నర-సింహ' అవతారంలో స్తంభం నుంచి ఉద్భవించాడు. హిరణ్య కశ్యపుని సంహరించిన అనంతరం శ్రీవారు ఆ ఉగ్ర రూపంలోనే కదిరి కొండ వద్ద సంచరించ సాగాడు. స్వామి అలాగే ఉండటం సరికాదని భావించిన మహర్షులు కొండపై నుంచి నారసింహుని వేడుకున్నారు. దీనికి గుర్తుగా ఆ కొండపై నారసింహుని ఆలయం కూడా ఉంది. అదే కొండపై శ్రీవారి పాద ముద్రికలు ఉన్నాయి. అందుకే ఈ ప్రాంతాన్ని 'ఖాద్రి' అని పిలిచారు. 'ఖా' అంటే విష్ణుపాదమని, 'అద్రి' అంటే కొండ అని అర్థం. ఖాద్రి ఇప్పుడు కదిరిగా పిలవబడుతోంది.

మహిమాన్వితుడు..

కదిరి ప్రాంతంలో ఒకప్పుడు ఖాదిరి వృక్షాలు (చంద్ర వృక్షాలు) ఎక్కువగా ఉండేవి. ఈ చెట్ల కింద ఒక పుట్టలో నారసింహుడు స్వయంభువుగా వెలిశాడని, అందుకే ఖాద్రీ నారసింహుడని పిలుస్తున్నారని మరో కథనం. ప్రతి నెలా స్వాతి నక్షత్రం రోజు ఇక్కడి మూల విరాట్‌కు అభిషేకం చేస్తారు. అభిషేకానంతరం హృదయ భాగం నుంచి స్వేద బిందువులు చూడచ్చు. ఇది స్వామివారి మహిమ అని అర్చకులు చెబుతారు.

రంగనాయకుడి కల ఈ ఆలయం..

పదో శతాబ్దంలో అప్పటి పట్నం పాలేగారైన రంగనాయకుడికి చెందిన గోవులు రోజూ ఖాదిరి వృక్షం కింద ఉన్న పుట్టలో పాలు వదిలేవి. ఆ పాలను నారసింహుడు తాగేవారని భక్తుల నమ్మకం. అందువల్లనే రంగనాయకులు ఆర్థికంగా బాగా ఎదిగారని ఒక కథనం. ఓరోజు ఆయనకు శ్రీవారు కలలో కన్పించి తాను స్వయంభువుగా వెలిశానని, పుట్టలో ఉన్న తన విగ్రహాన్ని వెలికితీసి గుడి కట్టించాలన్న కోరిక మేరకు ఆలయం నిర్మించినట్లు బ్రహ్మాండ పురాణం చెబుతోంది. నాటి ఆలయం కాల గతిలో అదృశ్యం కావడంతో బుక్కరాయలు, ఆ తర్వాత హరిహర రాయలు, చివరిగా శ్రీకృష్ణదేవరాయలు కాలంలో ఈ గుడి సంపూర్ణ నిర్మాణం జరిగినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి.

వసంత వల్లభుడని ఎందుకంటారంటే..

శ్రీ మహా విష్ణువు అనుగ్రహం కోసం భృగు మహర్షి ఈ ప్రాంతంలో తపస్సు చేశాడు. తపస్సుకు మెచ్చిన విష్ణువు తాను కోనేటిలో వెలిశానని, తన విగ్రహాలను వెలికి తీసి పూజాది కార్యక్రమాలు చేయాలని భృగు మహర్షిని కోరినట్లు కథనం. ఉత్సవ విగ్రహాల వెలికితీత జరిగింది వసంత మాసంలో కనుక స్వామివారికి వసంత వల్లభుడని పేరు వచ్చింది. అందుకే కోనేరును భృగు తీర్థమని పిలుస్తారు. ఆ ఉత్సవ విగ్రహాలనే బ్రహ్మోత్సవాల్లో రోజూ తిరువీధుల్లో ఊరేగిస్తారు. ఇంతటి తేజస్సు కల్గిన ఉత్సవ విగ్రహాలు ఎక్కడా లేవని భక్తులు చెబుతారు.

దేశంలోనే మూడో అతి పెద్ద బ్రహ్మరథం..

స్వామివారి బ్రహ్మ రథం సుమారు 540 టన్నుల బరువు, 37.5 అడుగుల ఎత్తు ఉంది. రథంలోని పీఠం వెడల్పు 16 అడుగులు ఉంది. 130 ఏళ్ల క్రితం ఈ బ్రహ్మరథం తయారు చేశారు. రథంపై సుమారు 256 శిల్ప కళాకృతులను టేకుతో అందంగా తీర్చిదిద్దారు. తమిళనాడులోని ఆండాల్ అమ్మవారి శ్రీవల్లి పుత్తూరు రథం, తంజావూరు జిల్లాలోని తిరువార్ రథం తర్వాత మూడో అతి పెద్దది ఈ ఖాద్రీశుడి బ్రహ్మ రథం.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


బాలకృష్ణ (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లుకు చెందిన బాలకృష్ణ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ముదిగల్లుకు చెందిన బొమ్మన్న, ఉమక్క దంపతులకు ముగ్గురు కుమారులు కాగా, రెండో కుమారుడు బాలకృష్ణ (26) బేల్దారి పనులతో జీవనం సాగించేవాడు. ఐదేళ్ల క్రితం కళ్యాణి అనే యువతితో ఆయనకు వివాహమైంది. వీరికి నాలుగేళ్ల వయసున్న కుమార్తెతో పాటు ఏడాది వయసున్న ఓ కుమారుడూ ఉన్నారు. కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాలకృష్ణ... జీవితంపై విరక్తితో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలు

- ద్విచక్ర వాహనం దగ్ధం


దగ్ధమైన ద్విచక్ర వాహనం

నార్పల: విద్యుత్తు స్తంభం కోసం ఘర్షణ చోటు చేసుకుని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు... నార్పల మండలం గూగూడుకు చెందిన నల్లప్ప, ఆయన కుమారుడు రామాంజినేయులు అదే గ్రామానికి చెందిన పూజారి పెద్ద రాజన్న ఆదివారం ఉదయం విద్యుత్తు స్తంభం కోసం గొడవపడ్డారు. పరస్పర దాడులకు దిగడంతో నల్లప్ప, రామాంజినేయులకు తీవ్ర గాయాలయ్యాయి. నల్లప్పకు చెందిన ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధమైంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వైద్యం వికటించి చిన్నారి మృతి

హిందూపురం అర్బన్: వైద్యం వికటించి మూడు నెలల చిన్నారి మృతి చెందిన ఘటన హిందూపురంలో ఆదివారం ఉద్రిక్తతకు దారితీసింది. వివరాలు.... లేపాక్షి మండలం కోడిపల్లికి చెందిన సోమశేఖర్, మంజుల దంపతుల మూడు నెలల చిన్నారికి ఆదివారం వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు వెంటనే హిందూపురంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న వైభవ శ్యామల చిన్నపిల్లల ఆస్పత్రికి తీసుకువచ్చారు. చికిత్స అనంతరం డాక్టర్ రాసిచ్చిన సిరప్ తీసుకుని మధ్యాహ్నం మూడు గంటలకు ఇంటికి చేరుకున్నారు. వైద్యుడు సూచించిన మోతాదులో మందు వేసిన కాసేపటికి శిశువు పరిస్థితి విషమించింది. దీంతో వెంటనే శిశువును తీసుకుని తిరిగి అదే ఆస్పత్రికి చేరుకున్నారు. ఆ సమయంలో డాక్టర్ బాలాజీ లేకపోవడంతో చేసేది లేక ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శిశువు మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలియగానే గ్రామస్తులు పెద్ద ఎత్తున వైభవ శ్యామల చిన్నపిల్లల ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు అక్కడకు చేరుకుని నచ్చచెప్పి ఆందోళనను విరమింపజేశారు.

పక్కాగా 'ప్రవర్తనా నియమావళి'

- ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో తక్షణమే అమలులోకి
- ఉల్లంఘిస్తే ఈసీ చర్యలు తప్పవు

అనంతపురం అర్బన్: ఈ నెల 16న సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల కమిషన్ ప్రకటించిన వెనువెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్ట్) అమలులోకి వచ్చింది. అభ్యర్థుల మార్గదర్శనంలో భాగంగా రాజకీయ పార్టీలు నిర్వహించే ఎన్నికల ప్రచారంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రవర్తనా నియమావళిని పాటించాలి. ఉలంఘన జరగకుండా ఎంసీసీ బృందాలు ప్రత్యేక దృష్టి సారిస్తాయి. సాధారణ ప్రవర్తన, సభలు, ఉరేగింపులు నిర్వహించడంలో అనుసరించాల్సిన నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటారు.


ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో విగ్రహానికి వేసిన ముసుగు

సాధారణ ప్రవర్తనా నియమావళి ఇదే...

= ఇదివరకే ఉన్న విభేదాలను మరింత పెంచేలా, పరస్పర ద్వేషాన్ని రగిల్చేలా, కులాలు, జాతుల మధ్య, మతపరమైన, భాషాపరమైన ఉద్రేకాలను కలిగించే ఏ రకమైన కార్యకలాపాలను ఏ పార్టీ అభ్యర్థులు నిర్వహించరాదు.

- ఇతర రాజకీయ పార్టీలను విమర్శ చేసే పక్షంలో అధికార విధానాలకు, కార్యకలాపాలకు, పాత రికార్డుకు, పనికి మాత్రమే పరిమితమై ఉండాలి. ఇతర పార్టీల నాయకులు లేదా కార్యకర్తల వ్యక్తిగత జీవితపు అన్ని కోణాల విమర్శను పరిహరించాలి. ఆరోపణలు లేక వక్రీకరణలపై ఆధారపడి ఇతర పార్టీలు లేక వాటి కార్యకర్తలను విమర్శించరాదు.
- ఓట్లను పొందడం కోసం కులం, మతపరమైన భావాలపరంగా అభ్యర్థన చేయకూడదు. ఎన్నికల ప్రచారం కోసం మసీదులు, చర్చీలు, దేవాలయాలు మరే ఆరాధనా ప్రదేశాలను, పాఠశాలలను వేదికగా ఉపయోగించకూడదు.
- ఓటర్లకు లంచం ఇవ్వడం, బెదిరించడం, అసలు వ్యక్తులకు బదులు ఇతరులను ఓటర్లుగా వ్యవహరింపచేయడం చేయకూడదు. పోలింగ్ స్టేషన్లకు 100 మీటర్ల పరిధిలో ప్రచారం చేయడం, పోలింగు పూర్తవడానికి నిర్ణయించిన సమయానికి 48 గంటల ముందు బహిరంగ సభలు నిర్వహించకూడదు. పోలింగ్ స్టేషన్‌కి ఓటర్లను తరలించడం వంటివి ఎన్నికల చట్ట పరిధిలో అవినీతికరమైన చర్యలే. వీటికి చట్టపరిధిలో శిక్ష తప్పదు.
- ప్రతి వ్యక్తికీ ప్రశాంతంగా, శాంతియుతంగా గృహజీవితాన్ని గడిపే హక్కు ఉంది. వ్యక్తుల అభిప్రాయాలు లేక కార్యక్రమాలు తమకు వ్యతిరేకంగా ఉన్నాయంటూ వారి ఇంటి ముందు నిరసన వ్యక్తం చేయడం, వ్యతిరేక ప్రదర్శనలు నిర్వహించడం, పికెటింగ్ వంటివి చేయకూడదు.
- ప్రచారం కోసం జెండాలు కట్టడం, బ్యానర్ తగిలించడం, నోటీసులు అతికించడం, నినాదాలు రాయడం తదితర పనులకు ఓ వ్యక్తి భూమి, భవనం, ప్రహరీను సదరు వ్యక్తి అనుమతి లేకుండా ఉపయోగించరాదు.
- వేరొక పార్టీ సమావేశంలో మౌఖికంగా లేదా రాతపూర్వకంగా ప్రశ్నలు వేయడం, తమ పార్టీ కరపత్రాలు పంచడం లాంటి పనులు చేయకూడదు. ఓ పార్టీ జారీ చేసిన పోస్టర్లను మరో పార్టీ వారు తొలగించరాదు.

సభల నిర్వహణ..

- పార్టీ లేక అభ్యర్థి స్థానిక పోలీసు అధికారులకు తగినంత సమయం ఉండేలా ముందుగానే సభ నిర్వహించే ప్రదేశం, సమయాన్ని తెలియజేయాలి.
- సభ ఏర్పాటు ప్రదేశంలో నిషిద్ధాత్మక లేక నిర్బంధాత్మక ఆదేశాలు ఉన్నాయా లేదా అనేది సరిచూసుకోవాలి. ఆదేశాల నుంచి మినహాయింపు కోరినట్లయితే, దాని కోసం అభ్యర్థన ముందుగానే పంపి మినహాయింపు పొందాలి.
- సభల్లో లౌడ్ స్పీకర్లు వినియోగించేందుకు ముందుగానే సంబంధిత అధికారికి లిఖితపూర్వకంగా అభ్యర్థనను సమర్పించి అనుమతి పొందాలి.
- సమావేశాలు భగ్నం చేయడం లేదా మరో విధంగా శాంతికి భంగం కలిగే విధంగా ప్రయత్నించే వ్యక్తులపై తప్పక చర్యలు తీసుకుంటారు.

ఊరేగింపులు..

- ఊరేగింపును నిర్వహించే పార్టీ లేదా అభ్యర్థి కార్యక్రమం ప్రారంభించే సమయం, ప్రదేశం, వెళ్లే మార్గం, ముగింపు సమయం, ప్రదేశం, తదితర విషయాలను ముందుగానే నిశ్చయం చేసుకోవాలి. దానిని అతిక్రమించరాదు.
- కార్యక్రమం గురించి స్థానిక పోలీసు అధికారులకు నిర్వహాకులు ముందుగానే తెలియజేయాలి. ఊరేగింపు సాగే ప్రదేశాలలో ఏవైనా నిర్బంధాత్మక ఆదేశాలు అమలులో ఉన్నాయా అనేది సరిచూసుకోవాలి. ట్రాఫిక్ నిబంధనలు, నిర్బంధాలను జాగ్రత్తగా అనుసరించాలి.
- అభ్యర్థులు లేదా పార్టీలు ఒకే మార్గంలో ఉరేగింపు తలపెట్టినప్పుడు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులను సంప్రదించాలి.
- ఊరేగింపులో పాల్గొనే వ్యక్తులు ప్రమాదకర వస్తువులూ వెంట తెచ్చుకోకుండా రాజకీయ పక్షాలు, అభ్యర్థులు బాధ్యత వహించాలి. అలాంటి వస్తువులను అసాంఘిక శక్తులు దుర్వినియోగం చేయవచ్చు.
- ఇతర రాజకీయ పార్టీల సభ్యులు లేదా నాయకుల దిష్టిబొమ్మలను మోసుకెళ్లడం, దహనం చేయడం, వ్యతిరేక ప్రదర్శన రూపాలను నిర్వహించకూడదు.

నియమావళి పాటించాలి



సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన మరుక్షణమే జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలులోకి వచ్చింది. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఎన్నికల ప్రవర్తన నియమావళిని అన్ని పార్టీలు, నాయకులు, అభ్యర్థులు తప్పనిసరిగా అనుసరించాలి.
– ఎం.గౌతమి, జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్

రాష్ట్ర లాన్ టెన్నిస్ సంఘం సహాయ కార్యదర్శిగా బాబ్జీ


నాగరాజబాబు (బాబ్జీ)

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ లాన్ టెన్నిస్ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా అనంతపురానికి చెందిన న్యాయవాది నాగరాజ బాబు (బాబ్జీ) ఎంపికయ్యారు. 2024–28 కాలానికి గాను సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు కాకినాడలోని టౌన్ హాల్ క్లబ్‌లో ఆదివారం జరిగాయి. ఈ ఎన్నికలకు ఆల్ ఇండియా టెన్నిస్ సంఘం ప్రతినిధి, రాష్ట్ర క్రీడా అథారిటీ ప్రతినిధులు పరిశీలకులుగా హాజరయ్యారు. రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన బాబ్జీని జిల్లా ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు పురుషోత్తం మురళీ కృష్ణ, న్యాయవాదులు గాజుల ఉమాపతి, ప్రసన్న, సుధీంద్ర అభినందించారు. 14 సంవత్సరాల తర్వాత రాష్ట్ర కమిటీలో జిల్లాకు చోటు దక్కడంపై జిల్లా టెన్నిస్ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్ర టెన్నిస్ సంఘం రెఫరీ కమిటీ సహాయక సభ్యుడిగా నగరానికి చెందిన కోచ్ హరికిషోర్‌కు చోటు దక్కింది.

భర్తపై గొడ్డలితో భార్య దాడి

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


హతుడు ఓబులేసు

ఉరవకొండ: మద్యం మత్తులో తరచూ హింసిస్తుండడంతో సహనం కోల్పోయిన భార్య గొడ్డలితో భర్తపై దాడి చేసింది. క్షతగాత్రుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు... ఉరవకొండ మండలం పెద్ద ముష్టూరుకు చెందిన ఓబులేసు, లలితమ్మ దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు ఉన్నాడు. బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవారు. కొంత కాలంగా ఓబులేసు (43) మద్యానికి బానిసయ్యాడు. సంపాదన మొత్తం తాగుడుకే ఖర్చు పెడుతూ ఇంటి బాగోగులు పట్టించుకోవడం మానేశాడు. దీంతో భార్య కూలి పనులకు వెళుతూ భర్త అవసరాలతో పాటు కుమారుడి పోషణ భారాన్ని నెత్తికెత్తుకుంది. ఈ క్రమంలో తాగుడు మానేసి, కుటుంబ పోషణపై దృష్టి సారించాలని పలుమార్లు భార్య వేడుకుంది. ఆ సమయంలో ఘర్షణ పడి ఇంట్లో భార్య దాచుకున్న డబ్బు కూడా లాక్కెళ్లి పూటుగా మద్యం సేవించి వచ్చేవాడు. ఈ క్రమంలో ఓబులేసు వేధింపులు తారాస్థాయికి చేరుకున్నాయి. ఆదివారం మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న ఓబులేసు... మరో క్వార్టర్ బాటిల్ కొనుగోలుకు డబ్బు ఇవ్వాలంటూ భార్యతో గొడవ పడ్డాడు. ఆమె నిరాకరించడంతో భౌతిక దాడికి దిగాడు. ఆమె ప్రతిఘటించడంతో మరింత రెచ్చిపోయిన ఓబులేసు విచక్షణారహితంగా కొట్టాడు. దీంతో సహనం కోల్పోయిన ఆమె చేతికి అందుబాటులో ఉన్న గొడ్డలితో ఎదురుదాడి చేసింది. అనంతరం తీవ్రంగా గాయపడిన ఓబులేసును ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి కుటుంబసభ్యులతో కలసి తీసుకెళ్లింది. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. చికిత్సకు స్పందించక అతను మృతి చెందాడు. దీంతో సాయంత్రం ఉరవకొండ పోలీసు స్టేషన్‌లో లలితమ్మ లొంగిపోయింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా అడ్డపల్లకీ ఉత్సవం


అడ్డపల్లకీలో ఊరేగుతున్న పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి

ఉరవకొండ: స్థానిక గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మఠం పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి అడ్డపల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం ఉదయం బూదగవి వద్ద ఉన్న విడిది మంటపం నుంచి వెలిగొండ రస్తాలోని మఠం వద్దకు పీఠాధిపతులు చేరుకున్నారు. ఆయనకు మఠం ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, కమిషనర్ చిట్టెమ్మ... పాదపూజ చేసి కాలుకు బంగారు గండపెండేరం తొడిగారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన అడ్డపల్లకీలో కూర్చోబెట్టి పాతగాం, దీచౌక్ మీదుగా గవిమఠానికి భారీ ఊరేగింపుతో చేరుకున్నారు. ఈ సందర్భంగా కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆదోని చౌకీ మఠం పీఠాధిపతి కళ్యాణస్వామి, ఏజెంట్ రాజన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పీఠాధిపతిని అడ్డుకున్న గ్రామస్తులు..

మఠం పీఠాధిపతి జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి గవిమఠానికి వెళ్లకుండా బూదగవి గ్రామస్తులు అడ్డుకున్నారు. ఆదివారం బూదగవి మఠంలో ప్రత్యేక పూజలు ముగించుకున్న అనంతరం వెలిగొండ రోడ్డు వద్ద ఉన్న విడిది మంటపానికి పీఠాధిపతి చేరుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో శిథిలావస్థకు చేరుకున్న బూదగవి మంటపాన్ని పునరుద్ధరించాలంటూ కొన్నేళ్లుగా గ్రామస్తులు కోరుతున్న మఠం అధికారులు పట్టించుకోవడం లేదంటూ గ్రామస్తులు పీఠాధిపతిని అడ్డుకున్నారు. మఠానికి రూ.కోట్లలో ఆదాయం ఉన్నా... బూదగవిలోని మఠం అభివృద్ధిని పట్టించుకోకపోవడం బాధకరమన్నారు. ఈ అంశంపై సహాయ కమిషనర్ చిట్టెమ్మకు భక్తులు ఫోన్ చేసి, వివరణ కోరగా... తనకు సంబంధం లేదని ఆమె నిర్లక్ష్యంగా చెబుతూ ఫోన్ కట్‌చేయడంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఆగ్రహానికి లోనయ్యారు. అనంతరం గ్రామస్తులకు మఠం ఏజెంట్ రాజన్నగౌడ్ నచ్చజెప్పి స్వామిని అడ్డుకోవడం సరైంది కాదని ప్రాధేయపడి ఒప్పించారు.

సరిహద్దున గస్తీ ముమ్మరం

- ఎన్నికల కోడ్ అమలుతో వాహనాలు జల్లెడ పడుతున్న పోలీసులు
- రూ.50 వేలు మించి నగదు ఉంటే సీజ్
- ఇప్పటికే రూ.4,09,91,680 నగదు స్వాధీనం


సరిహద్దు చెక్‌పోస్టులో వాహనాల తనిఖీ చేయిస్తున్న ఏఎస్పీ రామకృష్ణ

రాయదుర్గం: ఈ నెల 16న సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల కమిషన్ ప్రకటించిన వెనువెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్ట్) అమలులోకి వచ్చింది. ఈ క్రమంలో ఎన్నికలను శాంతియుత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. పొరుగున ఉన్న కర్ణాటక నుంచి మద్యం, గిఫ్ట్ ఐటమ్స్, నగదు జిల్లాలోకి తరలించకుండా సరిహద్దులోనే అడ్డుకుంటున్నారు. ఇందు కోసం ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే జిల్లాలోకి అనుమతిస్తున్నారు.

రూ.50 వేలకు మించితే ఆధారాలు తప్పనిసరి

ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సరిహద్దులో శనివారం రాత్రి నుంచే నిఘా మరింత పెంచారు. జిల్లాలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతాలైన రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలో మొత్తం 20 అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. అలాగే అత్యంత సమస్యాత్మక ప్రాంతంగా గుర్తించిన తాడిపత్రి పరిధిలో మూడు అంతరజిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిఘా పటిష్టం చేశారు. ఎక్కడికక్కడ నగదు, గిఫ్టులు, మద్యం తరలింపులను అడ్డుకుంటున్నారు. రూ.50 వేలకు మించి నగదు, గిఫ్ట్ బాక్సులు ఉంటే వెంటనే వాటికి సరైన ఆధారాలు అడుగుతున్నారు. ఆధారాలు చూపకపోతే తరలింపుదారు ఎంతటివారైనా ఉపేక్షించకుండా వెంటనే సీజ్ చేసేస్తున్నారు. ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు ఈ ఏడాది జనవరి 5 నుంచి చెక్‌పోస్టుల్లో నిఘా పెంచిన పోలీసులు వివిధ కేసుల్లో మొత్తంగా రూ.4,09,91,680 నగదు స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తూ 104 మంది పట్టుబడగా, 590.785 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని 29 వాహనాలను సీజ్ చేశారు.

పొరపాట్లకు తావిస్తే చర్యలు తప్పవు

ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు జిల్లాలో 23 చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జిల్లా మొత్తం పోలీసు నిఘా నీడలోకి తీసుకొచ్చాం. రూ.50 వేలకు పైగా నగదు, గిఫ్ట్ ఐటమ్‌లు తరలిస్తే సరైనా ఆధారాలు చూపాలి. లేకుంటే నగదు సీజ్ చేస్తాం. మద్యం అక్రమ తరలింపులను పటిష్టంగా అడ్డుకుంటున్నాం. – జి.రామకృష్ణ, సెబ్ అడిషనల్ ఎస్పీ

అలరించిన ఆదిలాబాద్ భక్తులు


సంగీత కచేరి నిర్వహిస్తున్న అదిలాబాద్ జిల్లా సత్యసాయి భక్తులు

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన అదిలాబాద్ జిల్లా సత్యసాయి భక్తులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ఆదివారం ఉదయం సత్యసాయి మహాసమాధి సంగీత కచేరి నిర్వహించారు. సాయంత్రం అంతర్జాతీయ క్షేత్రంలో అద్భుత మూర్తి పేరుతో సందేశాత్మక నాటికను ప్రదర్శించారు. విద్యా సంస్థలతో పాటు, వైద్య సంస్థలను సత్యసాయి స్థాపించి ప్రజలకు అందించిన సేవలను నాటిక ద్వారా చక్కగా వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా సత్యసాయి మెడికల్ క్యాంపుల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను కొనియాడారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.


నాటికలోని ఓ సన్నివేశం

వైఎస్సార్‌సీపీలో చేరిక


పార్టీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ఆకర్షితులైన ఎంఐఎం పార్టీకి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డిని ఆయన నివాసం వద్ద ఆదివారం ఎంఐఎం నగరాధ్యక్షుడు రాణా చిరంజీవి, కార్యదర్శి అల్లాబకాష్ కలిసి పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. వీరితో పాటు ఆరవవేటి రవి, ఖాజా, శ్రీనివాసులు, ఆబిద, బాబావలి, మురళి, కృష్ణమూర్తి, ఆసిఫ్ అలీ, ఇంతియాజ్‌ఖాన్, గోపాలరావు తదితరులకు పార్టీ కండువాలు వేసి పార్టీకి ఎమ్మెల్యే అనంత ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మైనార్టీల సంక్షేమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యపడుతుందనేది వాస్తవమని తేలిందన్నారు. బడుగు, బలహీన వర్గాలు అన్ని విధాల అభివృద్ధి సాధించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో అనంతపురం నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాసంలో ప్రార్థనలు..

అనంతపురం పట్టణ సీఎస్ఐ ట్రినిటీ చర్చ్ పాస్టర్ బెన్హర్ బాబు, సంఘ పెద్దలు జాన్ సుధీర్, సురేష్‌పాల్ తదితరులు ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డిని ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రార్థనలు నిర్వహించి, ఎమ్మెల్యేను ఆశీర్వదించారు.

ఏడు తులాల బంగారు నగల చోరీ

గుత్తి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికురాలి బ్యాగ్‌లో నుంచి బంగారు నగలను అపహరించుకెళ్లిన ఘటన సంచలనం రేకెత్తించింది. వివరాలు.. గుంతకల్లులోని రాజేంద్ర నగర్‌కు చెందిన జయలక్ష్మి శనివారం పెద్దవడుగూరు మండలం అప్పేచెర్లలోని బంధువుల ఇంటికి వెళ్లింది. రాత్రికి తిరుగు ప్రయాణమైన ఆమె గుత్తి బస్టాండ్‌కు చేరుకుంది. బస్సు రాగానే ఎక్కి అందులో కూర్చొంది. ఈ క్రమంలో తన పక్కన కూర్చొని ఉన్న మహిళ కాసేపటి తర్వాత బస్సు దిగి హడావిడిగా వెళ్లిపోయింది. దీంతో అనుమానం వచ్చిన జయలక్ష్మి వెంటనే తన వ్యానిటీ బ్యాగ్‌ను పరిశీలించింది. అందులో ఉన్న ఏడు తులా బంగారు నగలు కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించి వెంటనే బస్సు దిగి వెళ్లిపోయిన మహిళ గురించి బస్టాండు ప్రాంతంలో ఆరా తీసింది. ఫలితం దక్కక పోవడంతో ఆదివారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి గుత్తి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని సీఐ వెంకట్రామిరెడ్డికి ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వడివడిగా భూముల రీ–సర్వే


రోవర్ ద్వారా హద్దుల నిర్ధారణను పరిశీలిస్తున్న సర్వేశాఖ ఏడీ రూప్లానాయక్

- మూడో విడతలో 115 గ్రామాల్లో సర్వే పూర్తి
- 93 గ్రామాల్లో హద్దురాళ్ల ఏర్పాటు

అనంతపురం అర్బన్: భూ వివాదాలు... భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష' పథకం కింద జిల్లాలో రీ–సర్వే కార్యక్రమం వడివడిగా సాగుతోంది. మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో 31 మండలాల పరిధిలోని 503 గ్రామాల్లో సర్వే చేపట్టారు. ఇప్పటికే రెండు విడతల్లో 83 గ్రామాల్లో రీ–సర్వే పూర్తి చేశారు. ప్రస్తుతం మూడో విడత కింద 115 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తయ్యింది.

93 గ్రామాల్లో హద్దు రాళ్లు..

మూడో విడత కింద 115 గ్రామాల్లో 3,55,359.06 ఎకరాలు రీ– సర్వే చేశారు. ఇందుకు సంబంధించి ఫైనల్ ఆర్ఓఆర్ (రికార్డ్ ఆఫ్ రైట్స్) పూర్తి చేశారు. అన్ని గ్రామాలకు సంబంధించి ఓఆర్ఐ (ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్) వచ్చాయి. ఈ గ్రామాల్లో '13 నోటిఫికేషన్' జారీ చేశారు. అన్ని గ్రామాలకు గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. 1,17,027 ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సల్ మ్యాప్స్– భూ కమతం పటాలు) సిద్ధం చేశారు. సర్వే పూర్తి చేసి 115 గ్రామాల్లో ఇప్పటి వరకు 93 గ్రామాల్లో హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. మిగిలిన గ్రామాల్లో త్వరలో పూర్తి చేయనున్నారు.

రైతులకు సదవకాశం..

జాయింట్ ఎల్‌పీఎంల విషయంలో రైతులకు ప్రభుత్వం సదవకాశం కల్పించింది. మొదటి, రెండవ విడతల్లో సర్వే చేసిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎంలను విభజించుకునేందుకు వీలు కల్పించింది. రుసుం లేకుండా జాయింట్ ఎల్‌పీఎంను విభజించుకునేందుకు (స్ప్లిట్) ఒక ఏడాది గడువు ఇచ్చింది.

తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి



గాయపడిన ఖాదర్

తాడిపత్రి: ఎన్నికల్లో ఓటమి భయంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నేతలు దాడులకు తెరలేపారు. తాడిపత్రి రూరల్ పరిధిలోని గన్నెవారిపల్లి కాలనీలో ఆదివారం రాత్రి ఏకంగా ఓ వైఎస్సార్‌సీపీ కార్యకర్తను హత్య చేసేందుకు విఫలయత్నం జరిగింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన కార్యకర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాలు... టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ చింబిలి వెంకటరమణ వర్గానికి చెందిన ఖాదర్, మరో 50 మంది ఇటీవల ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి గన్నెవారిపల్లి కాలనీలో ఓ చికెన్‌సెంటర్ వద్ద ఖాదర్‌పై చింబిలి వెంకటరమణ ప్రోద్బలంతో అల్లీపీరా మచ్చుకత్తితో దాడికి తెగబడ్డాడు. ఘటనలో తీవ్ర రక్త గాయాలతో ఖాదర్ కుప్పకూలగానే కత్తితో సహా అక్కడికి సమీపంలోనే ఉన్న చింబిలి వెంకటరమణ కార్యాలయంలోకి అల్లీపీరా వెళ్లిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. క్షతగాత్రుడిని వెంటనే తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై తాడిపత్రి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి సాయిప్రతాపరెడ్డి వెంటనే తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి చేరుకుని క్షతగాత్రుడిని పరామర్శించారు. ఘటనకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.


ఖాదర్‌తో మాట్లాడుతున్న కేతిరెడ్డి సాయిప్రతాపరెడ్డి

క్లుప్తంగా

'కోడ్' కూసింది



వద్దుపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి ముసుగు వేసిన అధికారులు

ఆత్మకూరు: రాష్ట్రంలో ఎన్నికల నగారా మోగింది. ఎన్నికల కోడ్ తక్షణం అమల్లోకి రావడంతో మండలంలోని అన్ని చోట్ల రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు, ఫ్లెక్సీల తొలగింపునకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆదివారం గ్రామాల్లో డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలకు గుడ్డలు కప్పి ముసుగులు వేశారు. ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలని అధికారులు ఆదేశించారు.

నేడు 20వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 20వ డివిజన్‌లో సోమవారం ఉదయం 7 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని మోమిన్ స్ట్రీట్ పవర్ ఆఫీస్ నుంచి కార్యక్రమం మొదలవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు




అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పంచామృతాభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి మూల విరాట్‌కు అభిషేకాల అనంతరం పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. స్వామి బంగారు కవచాన్ని ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాలసర్పదోష నివారణ రాహుకేతు హోమాలు చేపట్టారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీ దేవికి పూజలు చేశారు. భక్తులకు ప్రసాదం అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

లాభాల దిశగా అర్బన్ బ్యాంకు

అనంతపురం అగ్రికల్చర్: ఖాతాదారుల శ్రేయస్సే లక్ష్యంగా పాలకవర్గం, అధికారులు బాధ్యతగా పని చేస్తుండటంతో ది అనంతపురం అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంకు లాభాల బాట పట్టిందని బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ తెలిపారు. ఆదివారం స్థానిక టౌన్ బ్యాంకు కార్యాలయంలో సీఈఓ విజయభాస్కర్ అధ్యక్షతన 108వ వార్షిక మహాజన సభ నిర్వహించారు. ప్రస్తుత పాలకవర్గం ఏర్పడిన ఈ 16 నెలల కాలంలో బ్యాంకు పురోగతి సాధించిందన్నారు. 6.19 శాతం ఉన్న నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) ఇపుడు 2.10 శాతానికి తగ్గించామని తెలిపారు. అలాగే రూ.120 కోట్ల వరకూ డిపాజిట్లు సేకరించి, వివిధ వర్గాల అభ్యున్నతికి రుణాలు మంజూరు చేశామన్నారు. త్వరలోనే ఏటీఎం, ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ లాంటి ఆన్‌లైన్ సదుపాయాలు అందుబాటులోకి తెస్తామన్నారు. భవిష్యత్తులో ఖాతాదారుల శ్రేయస్సుకు మెరుగైన బ్యాంకింగ్ సదుపాయాలు అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ చైర్మెన్లు వెంకటాద్రి, ఎస్.బాషా, డైరెక్టర్లు, ఖాతాదారులు పాల్గొన్నారు.

సేవా మార్గంతోనే ఉన్నత జీవితం



మజ్జిగ పంపిణీ చేస్తున్న దత్తవిజయానందతీర్థ స్వామీజీ

అనంతపురం కల్చరల్: సేవా మార్గం, ధర్మమార్గంతోనే జీవితం ఉన్నతంగా సాగుతుందని దత్త పీఠం ఉత్తరాధికారి దత్తవిజయానందతీర్థ స్వామీజీ అన్నారు. నగరంలోని గణపతి సచ్చిదానంద ఆశ్రమం షోడశ దత్తక్షేత్రం 36వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా స్వామీజీ బొమ్మేపర్తి ఆశ్రమానికి విచ్చేశారు. వివిధ ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే స్థానిక జెడ్పీ కార్యాలయం సమీపంలోని దత్తమందిరంలో మూడు రోజుల పాటు సాగే వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. యాగశాల ప్రవేశం, దీక్షాధారణ, అంకురారోహణం, అఖండ దీపారాధన, గణపతి వాస్తుహోమాలు, మధ్యాహ్నం పూర్ణాహుతి జరిగాయి. సాయంత్రం అవాహిత దేవతా హోమం, నీరాజన మంత్రపుష్పం, అష్టావధాన సేవలు నిర్వహించారు. దత్తవిజయానంద తీర్థస్వామీజీ ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో భారీ నగరోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఫ్యాన్ ప్రభంజనం ఖాయం

- ప్రజల ఆకాంక్షను నెరవేర్చాం
- రెట్టింపు సంక్షేమాన్ని అందించాం
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 11వ డివిజన్‌లో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టిస్తుందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం 11వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలోని వివిధ డివిజన్లలో అభివృద్ధి, సంక్షేమం అందించాలని 2019 ఎన్నికలకు ముందు నియోజకవర్గ ప్రజలు విజ్ఞప్తి చేశారు. వారి ఆకాంక్షను నెరవేర్చేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఇచ్చిన మాట ప్రకారం నగరం నలుదిక్కులా అభివృద్ధి చేశామన్నారు. బళ్లారి బైపాస్ నుంచి టవర్‌క్లాక్ రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌ని నిర్దేశిత సమయం కంటే ముందస్తుగా పనులు పూర్తి చేసి జిల్లా ప్రజలకు ట్రాఫిక్ సమస్య లేకుండా చూశామన్నారు. అదే విధంగా రుద్రంపేట బైపాస్, గుత్తి రోడ్డు, రాజీవ్ కాలనీ, కలెక్టరేట్ రోడ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటితో పాటు అంతర్గత రోడ్లు వేశామని గుర్తు చేశారు. పాతూరులోని వివిధ ప్రాంతాల్లోని నాలుగు, ఐదడుగులున్న ఇరుకు వీధుల్లో రోడ్లు వేయించామన్నారు. మనుషులు తిరగడానికే ఇబ్బందిగా ఉండే ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలోని పాలకులు ఇటువంటి ప్రాంతాల వైపు తొంగి కూడా చూడలేదని మండిపడ్డారు.

రూ.4 లక్షల కోట్లకు పైగా సంక్షేమం

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు ఇవ్వలేరని ప్రతిపక్షాలు ఆరోపణలు చేశాయి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.4 లక్షల కోట్లకు పైగా సంక్షేమాన్ని ప్రజలకు అందించిన ఘనత ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నియోజవర్గంలో రూ.2,305 కోట్లతో సంక్షేమాన్ని అందించామన్నారు. మధ్యవర్తులు లేకుండా నేరుగా ప్రజల ఖాతాల్లోకి డబ్బు జమ అయ్యిందన్నారు. ఇంత పారదర్శకంగా ప్రజలకు డబ్బులందించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు.

ప్రభుత్వంపై విశ్వాసం

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు చేసిన మేలు పట్ల ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం నెలకొందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీకి ప్రజలు అండగా నిలుస్తారని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజీఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, కార్పొరేటర్లు రామాంజినమ్మ, సాకే చంద్ర, రహంతుల్లా, సంపంగి రామాంజనేయులు, ఇసాక్, బాలాంజినేయులు, అనిల్‌కుమార్ రెడ్డి, సుమతి, లీలావతి, సాకే చంద్రలేఖ, పార్టీ సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రిలాక్స్ నాగరాజు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు సైఫుల్లాబేగ్, ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, శ్రీదేవి, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు చింతా సోమశేఖర్ రెడ్డి, చింతకుంట మధు, లక్ష్మణ్, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, రామయ్య, జానీ, సాకే కుళ్లాయస్వామి, మిద్దె నగేష్, మన్నల సత్యనారాయణ, దాదు, భారతి, రాజేశ్వరి, అంజలి, రాజేశ్వరి, శోభాబాయి, ఉష, తదితరులు పాల్గొన్నారు.

కొడిమి పంచాయతీలో టీడీపీకి షాక్



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కొడిమి పంచాయతీలో టీడీపీకి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో కొడిమి పంచాయతీ ప్రజాచైతన్య కాలనీకి చెందిన వారు టీడీపీ వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. సంతోష్ నాయక్, మాధవి, చాముండమ్మ, సఫియాభాను, జైతుంబి, పెద్దన్న, రమాదేవి, శకుంతలమ్మ, రెడ్డప్ప, ఆనంద్‌నాయక్, హక్కేనాయక్, ఫర్వీన్, బాబావలి, ఫాతిమా, అక్బర్‌వలి, ఇస్మాయిల్, విజయ్‌నాయక్‌కు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన సంక్షేమ పథకాల నగదు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతో మా ప్రాంతంలో రోడ్ల నిర్మాణాలు జరిగాయన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కొడిమి పంచాయతీకి చెందిన పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జాషువా పద్యగాన వారసుడు 'రామలింగమయ్య'




అంకె రామలింగమయ్యను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, తదితరులు

అనంతపురం సిటీ: జాషువా జాతీయ పురస్కారం 'కళాభూషణ్' అవార్డు గ్రహీత డా.అంకె రామలింగమయ్య.. మహాకవి గుర్రం జాషువా పద్యగాన వారసుడిగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గుర్తింపు పొందడం గర్వంగా ఉందని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కొనియాడారు. ఆదివారం జెడ్పీ ఆవరణలో ఉన్న డీపీఆర్‌సీ భవన్‌లో మహాబోధి సాహిత్య వేదిక అధ్యక్షుడు దాసన్నగారి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో డా.అంకె రామలింగమయ్యకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ.. తన మేనమామ అయిన రామలింగమయ్య.. చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉంటూనే మరోవైపు సాహిత్యం, కళలపై ఆసక్తి పెంచుకున్నారన్నారు. తెలుగుభాషలో పీహెచ్‌డీ చేసి అధ్యాపకుడిగా ఉంటూనే జాషువా సాహిత్యాన్ని ఔపోసన పట్టారని గుర్తు చేశారు. గంభీరమైన స్వరంతో ఆయన పద్యం ఆలపిస్తే ఎంతటి వారైనా ఇట్టే ఆకర్షితులవుతారని కొనియాడారు. జాషువా సాహిత్యమంటే రామలింగమయ్యకు ఎంతో ఇష్టమని మహాబోధి సాహిత్య వేదిక అధ్యక్షుడు కృష్ణమూర్తి తెలిపారు. ఆత్మీయ అతిథులుగా హాజరైన ఆచార్య రాచేపల్లి దేవన్న, లలిత కళాపరిషత్ అధ్యక్షుడు గాజుల వెంకట సుబ్బయ్యతో పాటు డా.అంకె రామలింగమయ్య జాషువా గబ్బిలం, ఫిరదౌసి కావ్యాల్లోని పద్యాలను రాగయుక్తంగా ఆలపించారు. అనంతరం అవార్డు గ్రహీత డా.అంకె రామలింగమయ్యను సత్కరించారు. కార్యక్రమంలో సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా.రమేశ్ నారాయణ, వాల్మీకి, బోయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల శ్రీనివాసరావు, సాహితీవేత్తలు డా.అంకె ఆదెప్ప, రియాజుద్దీన్, తోట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం

- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- నియోజకవర్గంలో 281 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంత బాబు



రాప్తాడు: కేంద్ర ఎన్నికల సంఘం శనివారం సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వడంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంత బాబు మీడియా సమావేశంలో మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు అధికార యంత్రాంగానికి సహకరించాలన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో ఆరు మండలాల్లో మొత్తం 279 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆత్మకూరు మండలంలోని గోరిదిండ్ల, అనంతపురం రూరల్ మండలంలోని కక్కలపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో 1,500 పైగా ఓటర్లు ఉండడంతో అక్కడా రెండు కేంద్రాలు పెంచాలని ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు. రెండు కేంద్రాలు పెరిగితే 281 కేంద్రాలు ఉంటాయన్నారు. ఈనెల 17 వరకూ సిద్ధమైన తుది నియోజకవర్గ ఓటర్ల జాబితా ప్రకారం 2,48,801 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ఇందులో పురుషులు 1,24,164 ఉండగా.. మహిళలు 1,24,625 మంది ఇతరులు 12 మంది ఉన్నట్లు తెలిపారు. ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ అని అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 14వ తేదీ వరకూ నమోదైన ఓటర్లు ఎన్నికల్లో ఓటు వేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందిస్తున్నామన్నారు. 85 ఏళ్లు దాటిన ఓటర్లకు ఇంటి వద్దే ఓటు వేసేలా ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమలులోకి వచ్చింది. దీంతో నియమావళిని పక్కాగా అమలు చేసేందుకు ఆర్వో వసంత బాబు ఆదివారం ఆరు మండలాల అధికారలతో వరుసగా సమీక్ష సమావేశాలు నిర్వహించారు. నియమావళిని అమలు చేసేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. మూడు స్టాటిక్ సర్విలెన్స్ బృందాలు, మూడు విడియో సర్విలెన్స్ బృందాలు, మూడు వీడియో వ్యూయింగ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా జరిగేందుకు 35 రూట్లలో 34 మంది సెక్టోరియల్ అధికారులను నియమించారు. అధికారులతో ఇప్పటికే పలుమార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల నియమావళి ఉల్లఘింస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్వో హెచ్చరించారు.

స్పందన రద్దు

అనంతపురం కార్పొరేషన్: సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు నగరపాలక సంస్థలో సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కమిషనర్ మేఘ స్వరూప్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



కనగానపల్లి: మామిళ్లపల్లిలో ప్రచారం చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



రాప్తాడు: ప్రసన్నాయపల్లిలో ఓటు అభ్యర్థిస్తున్న తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి



చెన్నేకొత్తపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

కనగానపల్లి: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు అంతా కలిసికట్టుగా పని చేద్దామని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ తెలిపారు. ఆదివారం మండలంలోని మామిళ్లపల్లి, నరసంపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు ఇచ్చిన దొంగ హామీల గురించి ప్రజలకు తెలియజేశారు. రాప్తాడు నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, నాయకులు తగరకుంట వెంకటరాముడు, భాస్కరరెడ్డి, నారాయణ స్వామి, కృష్ణారెడ్డి, యలకుంట్ల అమరనాథరెడ్డి, పెద్దిరెడ్డి, తిరుపాలు, మాధవరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


రాప్తాడు: ప్రసన్నాయపల్లి పంచాయతీలో దాదాపు రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని ప్రసన్నాయపల్లిలో వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్‌తో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబుకు ఓటు వేస్తే పథకాలన్నీ రద్దు చేస్తారని తెలిపారు. గతంలో రుణమాఫీ చేస్తామని చెప్పి దారుణంగా మోసం చేశారని మండిపడ్డారు. ప్రసన్నాయపల్లి పంచాయతీని రోల్డ్ మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఎన్నికల్లో తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల యూత్ కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గవ్వల పరంధమ, వైఎస్సార్ సీపీ నాయకులు వెన్నపూస లోకేశ్వర్ రెడ్డి, విజయ్ వర్ధన్ రెడ్డి, ఉషారాణి, భాగ్యమ్మ, బోయ మనోహర్, డీలర్ సాంబశివా రెడ్డి, సింగారప్ప, జయన్న, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం

చెన్నేకొత్తపల్లి: ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రచారం చేపట్టారు. తొలుత కొల్లాపురమ్మ, ఓబుళ లక్ష్మీనరసింహస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక దళితవాడ నుంచి ఎన్నికల ప్రచారాన్ని నాయకులు ప్రారంభించారు. పార్టీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి, నాయకులు ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి, మాడెం ప్రకాష్‌రెడ్డి, తాతిరెడ్డి, గోపాల్‌రెడ్డి, నారాయణస్వామి, హనుమంతరెడ్డి, కిష్ట, బొగ్గు ప్రసాద్, డీలర్లు రామాంజి, ప్రసాద్, ఓబుళేసు, ఈశ్వరయ్య, మురళీధర్‌రెడ్డి, గాలిమిషన్ వెంకటేష్, రామాంజి, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, మంజునాథ్, ఉమామహేశ్వరరెడ్డి, రమేష్, సాంబశివ, ముత్యాలు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు



ఆత్మకూరులో డెస్కులపై హాల్‌టికెట్ల స్టిక్కర్లను అతికిస్తున్న దృశ్యం

ఆత్మకూరు/రాప్తాడు/కనగానపల్లి/చెన్నేకొత్తపల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల కోసం ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆత్మకూరు మండల వ్యాప్తంగా 808 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఎంఈఓ నరసింహారెడ్డి తెలిపారు. ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 313 మంది, కేజీబీవీ పాఠశాలలో 190 మంది, హోలిస్పిరిట్ ప్రైవేటు పాఠశాలలో 305 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద గుంపులు గుంపులుగా ఉండరాదని 144 సెక్షన్ అమలులో ఉంటుందని తహసీల్దార్ పరమేశ్వర స్వామి తెలిపారు. రాప్తాడు మండలంలో పది పరీక్షల కోసం ఐదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ మల్లికార్జున తెలిపారు. రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 127 మంది, మోడల్ స్కూల్‌లో 203 మంది, ఆర్డీటీ అంధుల పాఠశాలలో 175, విన్సెంట్ డీపాల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 260, ఎల్లార్జీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 250 మంది పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు. కనగాపల్లి మండలంలో 8 ఉన్నత పాఠశాలలకు చెందిన 403 మంది రెగ్యూలర్, 60 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు ఎంఈఓ అరుణమ్మ తెలిపారు. చెన్నేకొత్తపల్లిలో పది పరీక్షలకు రెండు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓలు మున్వర్‌భాషా, ప్రసన్నకుమార్ నాయుడు పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 220 మంది, ఏపీ మోడల్ స్కూల్‌లో 170 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు.

21న తాతార్యారూఢ స్వామి పుష్ప రథోత్సవం

గార్లదిన్నె: మండలంలోని మర్తాడులో ఈనెల 21న తాతార్యారూఢ స్వామి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాతార్యా రూఢస్వామి జీవ సమాధి కావడంతో ఏటా గ్రామస్తుల ఆధ్వర్యంలో తిరునాల నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. బుధవారం ధ్వజారోహణ, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, గురువారం గంగపూజ, కలశ స్థాపన, రుద్రయజ్ఞం, స్వామి వారికి పట్టు వస్త్రాల సమర్పణ, సహస్ర బిల్వార్చన, రాత్రి 10 గంటలకు స్వామి పుష్ప రథోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తుల సౌకార్యర్థం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

అభాగ్యుడికి 'అమ్మ' ఆసరా



ఆర్థికసాయం అందజేస్తున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: ఓ అభాగ్యుడికి అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి అండగా నిలిచారు. వివరాలు.. నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డుకు చెందిన నారాయణ పుట్టుకతోనే పాక్షికంగా చూపు కోల్పోయాడు. తల్లిదండ్రులిద్దరూ మరణించడంతో మేనమామ అంజినప్ప వద్ద పెరిగాడు. చిన్న టీ కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఆరోగ్యం క్షీణించి లివర్ పూర్తిగా దెబ్బతింది. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు రూ.15 లక్షలు అవసరమని డాక్టర్లు చెప్పారు. దీంతో వారికున్న స్థలాన్ని విక్రయించినా రూ.10 లక్షలకు మించి రాలేదు. విధి లేక అమ్మ సంస్థను ఆశ్రయించారు. మానవత్వంతో స్పందించిన తరిమెల రమణారెడ్డి ఆదివారం వారింటికి వెళ్లి రూ.3 లక్షల నగదు అందించారు. ఆపరేషన్‌కు అవసరమయ్యే మిగిలిన సొమ్ము అందిస్తానని భరోసా ఇచ్చారు. నారాయణ కుటుంబ సభ్యులు తరిమెల రమణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే 'అనంత' గెలవాలని ప్రార్థనలు

అనంతపురం కల్చరల్: పాతూరు భాగ్య నగర్‌లోని మస్జిద్ ఏ హుస్సేన్ వద్ద ఆదివారం ఇఫ్తార్ విందు జరిగింది. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పాల్గొని ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. అనంత మరోసారి ఎమ్మెల్యేగా అఖండ మెజార్టీతో గెలవాలని మసీదు నిర్వాహకుడు ఇమాం మౌలానా జిలాన్ ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, నార్పల సత్యనారాయణ రెడ్డి, కార్పొరేటర్ సైఫుల్లా, కో–ఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, నాయకులు లక్ష్మన్న, బాషా, ముతవల్లి ముస్తాక్ సాబ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతినారాయణ కథా గమనం విభిన్నం



'గీతలు చెడిపి' పుస్తకావిష్కరణ చేస్తున్న ప్రముఖ కవులు, రచయితలు

అనంతపురం కల్చరల్: డాక్టర్ శాంతినారాయణ కథా గమనం విభిన్నమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోమ్‌లో డాక్టర్ వైఎస్సార్ లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీత శాంతినారాయణ రచించిన ×గీతలు చెడిపి₹ కథా సంపుటి ఆవిష్కరణ జరిగింది. ఆచార్య రాచపాలెం అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్ ప్రధాన వక్తగా శాంతినారాయణ రచనల విశిష్టతపై మాట్లాడారు. కథా సంపుటి స్వీకర్తగా నంద్యాల నుండి విచ్చేసిన శ్రీనివాసరెడ్డితో పాటూ మరో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, జనప్రియ కవి ఏలూరు యంగన్న తదితరులు ప్రసంగించారు. అంతకు ముందు ప్రజాగాయకుడు ఆదినారాయణ ఆలపించిన ఉద్దీపన గీతం ఆకట్టుకుంది. సీనియర్ రచయితలు సడ్లపల్లి చిదంబరరెడ్డి, ఉప్పరపాటి వెంకటేశులు, తూముచెర్ల రాజారామ్, గోసల నారాయణస్వామి తదితరులు ఆప్తవాక్యాలలో శాంతినారాయణ కథ, నవలలతో అనంత రచయితలకు స్ఫూర్తినిచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ రచయిత తరిమెల అమరనాథ రెడ్డి, జిల్లా రచయితల సంఘం కార్యనిర్వాహకులు సురేష్, వన్నప్ప, షరీఫ్, టీవీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంతల ఆదాయం రూ.3.41 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.41 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు యార్డు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల సంత ద్వారా రూ.1,68,790 కాగా, ఆదివారం జరిగిన పశువులు, గేదెలు, ఎద్దుల సంత నుంచి రూ.1,72,880 మేర వసూలైనట్లు పేర్కొన్నారు.